

పరిగి శివారులో పత్తి చేనులో నిలిచిన నీరు



మంత్రి తుమ్మల నుంచి అవార్డు అందుకుంటున్న చంద్రమౌళి

చేనేత కళాకారుడు చంద్రమౌళికి అవార్డు

ఆమనగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మాడ్గుల మండలం కొలుకుల పల్లి గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు గుర్రం చంద్రమౌళికి అరుదైన గౌరవం దక్కింది. చేనేత, జౌళిశాఖ అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఆయన ఎంపికయ్యాడు. గురువారం హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డులో ఉన్న పీపుల్స్ ప్లాజాలో జరిగిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నాడు. అలాగే రూ.25వేలు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సహజ రంగులతో సరికొత్త డిజైన్‌లలో ఇక్కత్ పట్టు చీరను నేసినందుకు చంద్రమౌళిని ఈ అవార్డు వరించింది. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ప్రధాన కార్యదర్శి శైలజారామయ్యర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు మస్న అశోక్, నాయకులు ఆనంద్ కుమార్, అప్పం రాజేశ్, భాస్కర్, వెంకన్న, సాయి తదితరులు పాల్గొన్నారు.

సిట్ ఎదుటకు కాంగ్రెస్ నాయకులు

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వాంగ్మూలం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సిట్ ఎదుట హాజరయ్యారు. షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ కొందుర్గు మండలశాఖ అధ్యక్షుడు ఏ.కృష్ణారెడ్డి, కాంగ్రెస్ గిరిజన ఆదివాసి రాష్ట్ర కో-ఆర్డినేటర్ రఘునాయక్‌లు బుధవారం సాయంత్రం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో వాంగ్మూలం ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన పరిణామాల గురించి వివరించి, వారి వద్ద ఉన్న ఆధారాలను ఏసీపీ పి.వెంకటగిరికి అందించారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో భాగంగా సిట్ ఎదుట హాజరుకావాలని పిలుపు రావడంతో వెళ్లామని బాబర్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కారణంగా ఎదురైన ఇబ్బందుల గురించి ఏసీపీ ప్రశ్నించారని తెలిపారు. ఆయన అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పామని వివరించారు.



జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఘట్‌కేసర్ మెయిన్ రోడ్డులో వర్షపు నీరు

ముంచెత్తిన వాన

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం

పొంగిపొర్లిన వాగులు, వంకలు.. చెరువులను తలపించిన రోడ్లు

ఇబ్బందులు పడిన వాహనదారులు.. కూలిన చెట్లు, తెగిన వైర్లు

ఉధృతంగా ప్రవహించిన ఈసీ, మూసీ వాగులు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దంచి కొట్టింది. సాయంత్రం ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గంటపాటు కుండపోతగా కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగి పొర్లాయి. చెరువులు, కుంటల్లోకి వరద నీరు చేరింది. చెక్‌డ్యాంలు అలుగు పారాయి. నగర శివారులో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఆఫీసుల నుంచి బయటకు వచ్చే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 7

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, కాకునూర్, నిర్దవెల్లి, లేమామిడి, కొత్తపేట, కేశంపేట, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, సంతాపూర్, లింగంధన, తొమ్మిదిరేకుల, అల్వాల, మంగళగూడ, చౌలపల్లి గ్రామాలలో వర్షం దంచికొట్టింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కేశంపేటలో సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు వచ్చింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే షాద్‌నగర్ పట్టణంలో గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లు జలమయం కావడంతో ట్రాఫిక్

మిగతా 7వ పేజీలో...



షాద్‌నగర్‌లో కురుస్తున్న వర్షం



కందుకూరు: పంట పొలాల్లో వర్షపు నీరు

రోడ్లపై కూలిన చెట్లు

దోమ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో వీచిన ఈదురుగాలులకు చెట్లు రోడ్లపై విరిగిపడ్డాయి. తిమ్మాయిపల్లి, ఊటుపల్లి ఫారెస్టు మధ్యలో 10 చెట్లు రోడ్డుపై విరిగి పడ్డాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇక చౌడాపూర్ మండల కేంద్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. తాండూరు నియోజకవర్గంలో బషీరాబాద్ మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ పొలాల వద్ద వివిధ పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు ఇబ్బందులు పడ్డారు. బషీరాబాద్, మైల్వార్, ఎక్మాయి, మంతన్‌గౌడ్, పర్వత్‌పల్లి తదితర గ్రామాల పరిధిలోని పంట పొలాల్లోకి వర్షం నీరు చేరి నీటి కుంటలను తలపించాయి. పలు గ్రామాల ప్రధాన, అంతర్గత



దోమ: తిమ్మాయిపల్లి రోడ్డుపై కూలిన చెట్లు

రోడ్లు జలమయమయ్యాయి. పర్వత్‌పల్లి గ్రామ ప్రధాన రోడ్డు అడగడుగున గుంతలు ఉండటంతో నీటితో నిండి కుంటలను తలపించాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో గురువారం రాత్రి గంటపాటు భారీ వర్షం కురిసింది. ఘట్‌కేసర్‌లోని ప్రధాన రోడ్డు మరమ్మతులు జరుగుతండటంతో రోడ్డు చెరువును తపించింది. ఈదురుగాలితోపాటు ఉరుములు, మెరుపులు రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

జిల్లా	మండలం	ప్రాంతం	నమోదు
రంగారెడ్డి	శేరిలింగంపల్లి	గచ్చిబౌలి	126.5
	సరూర్‌నగర్	జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్	113.0
	గండిపేట్	మణికొండ	109.5
మేడ్చల్	ఉప్పల్	జీహెచ్‌ఎంసీ జోనల్ ఆఫీస్	104.3
వికారాబాద్	పూడూరు	పెద్దఉమ్మెంతాల్	66.8

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

ఉచితంగా నారు పంపిణీకి ప్రణాళిక ›› పండ్ల తోటలకు సైతం రాయితీ



నర్సరీలో పెంచుతున్న నారు

చేవెళ్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైతే రైతులకు లాభాల కంటే నష్టాలే మిగులుతాయి. అలాగే ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఒక్కోసారి గిట్టుబాటు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనం నాటిన రోజు నుంచి పంట చేతికొచ్చే వరకు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించే ఉద్దేశంతో కూరగాయల సాగును పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన వన పంటలను ప్రోత్సహిస్తున్నాయి. సాగు విస్తీర్ణం పెంచేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్-2025 (ఎంఐడీహెచ్) పథకం ద్వారా కూరగాయల సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు నారును ఉచితంగా పంపిణీ చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లలో రైతులకు సరిపడా వివిధ రకాల హైబ్రిడ్ కూరగాయల నారును రైతులకు

మిగతా 8వ పేజీలో...

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత నారు కోసం సాగుకు నెల రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నారు, ఇతర రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పండ్ల తోటలు సాగు చేసే రైతులకు సైతం ప్రభుత్వం రాయితీ అందజేస్తుంది. ఏమైనా సందేహాలుంటే ఉద్యానవన శాఖ అధికారులను, 8977714222 నంబర్‌లో సంప్రదించాలి.

- కీర్తి, చేవెళ్ల డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి

ఇతర రాయితీ పథకాలు ఇలా..

ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల సాగుకు ఉచితంగా నారు ఇవ్వడమే కాకుండా ఇతర పంటల సాగుకు సైతం రాయతీలు ఇస్తున్నారు. ఉల్లిసాగు చేసే రైతులకు ఎకరానికి రూ.8వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నారు. తీగజాతి కూరగాయలు సాగు చేసే రైతులకు పందిళ్లు వేసుకోవడానికి ఒక్కో యూనిట్ (అర ఎకరం)కు రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్నారు. మల్చింగ్ సాగు కోసం ఒక రైతుకు గరిష్టంగా రెండు ఎకరాల వరకు, ఎకరానికి రూ.8 వేల చొప్పున రాయితీ లభిస్తుంది. ఈ రాయితీలు పొందడానికి రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.

వారి అనుబంధం ముందు

చావూ చతికిల!

కొన్ని గంటల వ్యవధిలోనే వృద్ధ దంపతుల మృతి

అస్వస్థతతో భర్త కన్నుమూసిన కొద్దిసేపటికే భార్యకు గుండెపోటు

వివరాలు 8లో..

శంకర్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో

సినీ హీరో గోపీచంద్ సందడి

శంకర్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ హీరో గోపీచంద్ గురువారం ఉదయం శంకర్‌పల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. మోకిలలోని బ్లూమ్స్ వెంచర్‌లో ఆయనకు సంబంధించిన 400గజాల విల్లా లావాదేవీ(రిజిస్ట్రేషన్)ల విషయమై ఆయన వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. వచ్చారు. రిజిస్ట్రార్ బాసిత్‌ఖాన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించిన వెంటనే ఆయన నగరానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, స్థానికులు గోపీచంద్‌తో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు.



సిద్దాపూర్‌ను సందర్శించిన యువ శాస్త్రవేత్తలు

- రైతులతో ముఖాముఖి

కొత్తూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామాన్ని రాజేంద్రనగర్ లోని జాతీయ వ్యవసాయ పరిశోధన శిక్షణ సంస్థలో ట్రైనింగ్ పొందుతున్న యువ శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ ఆధ్వర్యంలో ఆయా రాష్ట్రాలకు చెందిన 105మంది శిక్షణ పొందుతున్న సైంటిస్టులు గ్రామంలో రైతులతో ముఖాముఖి అయ్యారు. రైతులు పండిస్తున్న పంటలు, వారి స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు సాయిల్ టెస్టింగ్ కిట్లతో పాటు ఔషధ మొక్కలను అందజేశారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కంప్యూటర్ ప్రింటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకట్‌కుమార్, ఉమేష్, వెంకటేశం, మండల వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో యువ శాస్త్రవేత్తలు

పాడిరైతుల ప్రయోజనాలను కాపాడుతాం

- డీడీసీఎఫ్ డీడీ మోహన్‌మురళి

కడ్తాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విజయ పాల నాణ్యత, పాల ఉత్పత్తుల అమ్మకాలను పెంచి పాడి రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య డిప్యూటీ డైరెక్టర్ మోహన్‌మురళి తెలిపారు. పాల వెన్న శాతాన్ని పెంచి కొనుగోలు దారుల విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. కడ్తాల మండలంలోని పాల శీతలీకరణ కేంద్రం, మక్తమాదారం, చల్లంపల్లి పాల సేకరణ కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు, పాడి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు పాల బిల్లులు సకాలంలో అందించాలని, దాణా సక్రమంగా సరఫరా చేయాలని, పెంచిన దాణా రేటును తగ్గించాలని డీడీని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయ పాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, లాభాపేక్ష లేకుండా పాడి రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నామని తెలిపారు. ఇటీవల కొంతమేర పాలనాణ్యత పెరిగిందన్నారు. బకాయి పాలబిల్లులు త్వరలో చెల్లిస్తామని, ఇకపై జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మక్తమాదారం పాలశీతలీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీడీ మోహన్ మురళి



కడ్తాలలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

హైటెన్షన్ లైన్ అలైన్‌మెంట్ రద్దు చేయాలి

›› కడ్తాలలో రైతుల నిరసన ర్యాలీ ›› అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు

కడ్తాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కడ్తాల సమీపంలోని రైతుల పొలాల నుంచి 765కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను రద్దు చేయాలని స్థానిక రైతులు ఆందోళన చేపట్టారు. బీదర్ పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో బళ్లారి నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు చేపడుతున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. గురువారం కడ్తాలలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమకున్న ఎకరం, అర ఎకరం భూమి పోతే తాము ఎలా బతకాలని వాపోయారు. ఈ పొలాల ఆధారంగానే జీవనం వెళ్లదీస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ఇక్కడ పొలాల ధరలు అధికంగా ఉన్నాయని, విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే వాటిని అమ్ముకోవడానికి వీలుండదన్నారు. ఇదే విషయమై కలెక్టర్‌ను సైతం కలిశామని, ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. ఈ కార్యక్రమంలో రైతులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

- వృక్షాబంధన్‌లో విద్యార్థుల ప్రతిజ్ఞ

మానవాళికి ప్రాణవాయువును అందించే వృక్షాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరకల పరమేష్ అన్నారు. రక్షాబంధన్ పండుగ పురస్కరించుకొని గురువారం పాఠశాలలో మొక్కలకు విద్యార్థులు రాఖీ కట్టి... చెట్లను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఆదిభట్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి)





బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం

ఘట్‌కేసర్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): యాదాద్రి, జనగాం జిల్లాల పర్యటనకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకుఘట్‌కేసర్‌లో గురువారం నాయకులు ఘనస్వాగతం పలికారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఘట్‌కేసర్ నుంచి వెళ్తున్న విషయం తెలుసుకున్న నాయకులు బైపాస్ చౌరస్తా వద్ద రాంచందర్‌రావు రాగానే ఆపి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, హనుమాన్, ప్రవీణ్‌రావు, లక్ష్మారెడ్డి, గొంగల్ల బాలేష్, బాల్‌రాజ్, రవిశంకర్, రమాతీర్థ, రాధిక పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో రాంచందర్‌రావుకు శాలువా కప్పుతున్న నాయకులు

ప్రజాసేవకు చిరస్థాయి గుర్తింపు

● స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : మనిషి ఎంతకాలం బతికాడు అన్నది ముఖ్యం కాదని, ఉన్నత కాలం ఎంతమందికి మంచి చేశాడు అనేదే ముఖ్యమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ప్రజాసేవ చేసేవారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని అన్నారు. గురువారం పట్టణంలో సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వికారాబాద్ మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ చీకటిమర్ల విశ్వనాథంగుప్తా ప్రథమవర్ధంతి సంస్మరణ సభకు స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. విశ్వనాథం జీవితంలో రెండు విధాలా విజయవంతమయ్యారని, 103 సంవత్సరాలు పరిపూర్ణంగా జీవించారని, అలాగే వందేళ్ల వికారాబాద్ ప్రజలు గుర్తు చేసుకునే మంచి పనులు చేశారన్నారు. తనను గెలిపించిన వికారాబాద్ ప్రజల రుణాన్ని తీర్చుకోవడమే లక్ష్యమని ప్రసాద్‌కుమార్ అన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథంసత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, అనంతరెడ్డి, రాంచందర్‌రెడ్డి, రెడ్యానాయక్, సతీష్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


విశ్వనాథంగుప్తా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రసాద్‌కుమార్


జెండాను ఆవిష్కరిస్తున్న రఘునందన్‌రెడ్డి

ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియ

పారదర్శకంగా చేపట్టాలి

● టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించాలని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డి కోరారు. శంకర్‌పల్లి ప్రాథమిక పాఠశాల వద్ద టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేసి ప్రస్తుత కౌన్సిలింగ్ లోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదోన్నతుల ప్రక్రియ ముగిసేంత వరకూ ఉపాధ్యాయుల సర్దుబాటును తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. ఇతర శాఖల అధికారులను జిల్లా విద్యాశాఖ అధికారులుగా నియమించడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ ఆరోగ్యకార్డు పథకం ప్రారంభిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు అమలు కాకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మునీర్‌పాషా, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా కన్వీనర్ సుదర్శన్, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్, కొందుర్గు మండలాల అధ్యక్ష కార్యదర్శులు అంజయ్య, దయానందం, మొగులయ్య, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శివానందం, రాముశర్మ తదితరులున్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది కుర్చీల కొట్లాట

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్


మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

మహేశ్వరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులది కుర్చీల కొట్లాట మాత్రమేనని.. అభివృద్ధిపై ధ్యాస లేదని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. గురువారం మహేశ్వరం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు టి.యాదీష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గానికి వలస వచ్చిన నాయకులకు కుర్చీల కొట్లాట తప్ప.. ప్రజల సమస్యలు పట్టవని అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో విడుదలైన నిధులతో మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవల కందుకూరు, మహేశ్వరం మండలాలకు రూ.కోటీ 25లక్షల నిధులు కేటాయించారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.62 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి అభివృద్ధిపై ధ్యాస లేదు కానీ.. కుర్చీల కొట్లాట మాత్రం ఆగడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు, అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, యాదయ్యగౌడ్, పోతర్ల సుదర్శన్‌యాదవ్, శ్రవణ్, పరమేష్, రఘువీర్, చింటూ, సత్యం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు ప్రయోజనం చేకూర్చాలి



రమ్య చరితకు పట్టా ప్రదానం చేస్తున్న పురుషోత్తంరెడ్డి


మొయినాబాద్ రూరల్, ఆగస్టు7(ఆంధ్యజ్యోతి): విద్యతో పాటు పరిశోధనలు సమాజానికి ప్రయోజనం చేకూర్చాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధి హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన కె.రమ్య చరిత కెమిస్ట్రీ విభాగంలో 'సింథసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూయేషన్ ఆఫ్ మెటల్ కంప్లెక్సీస్ కంటైనింగ్ మెడిసినాలీ పోటెంట్ హెటిరోసైక్లిక్ ఎన్టిటీస్' అంశంపై డాక్టర్ కవిత పర్యవేక్షణలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. అదేవిధంగా రంజిత్ కుమార్ 'ఏ స్టడీ ఆన్ స్ట్రక్చర్డ్ టెక్స్ట్ డేటా అనలిసిస్ యూజింగ్ మెషీన్ లెర్నింగ్ రిథమ్స్' అంశంపై ప్రొఫెసర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో పరిశోధన చేయగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా రమ్యచరిత, రంజిత్‌కుమార్‌లకు పురుషోత్తంరెడ్డి గురువారం యూనివర్సిటీలో పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు పరిశోధన సమాజానికి ప్రయోజనం చేకూర్చాలని అభిప్రాయపడ్డారు. కెమిస్ట్రీ పరిశోధన యొక్క కీలక పాత్రను ఆయన నొక్కిచెప్పారు. ఇది విద్యాభివృద్ధిని ప్రోత్సహించడమే కాకుండా సామాజిక శ్రేయస్సును కూడా బాగా మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ అండ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, వైస్ చాన్స్‌లర్ శంకర్‌లింగం, రిజిస్ట్రార్ రవీందర్, డీన్ ఆచార్య క్రిష్టోఫర్, రాజేందర్‌రెడ్డి, శంకరయ్య, జగదీష్, కుమార స్వామి, డానియేల్, డాక్టర్ సరిత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అండ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు పాల్గొన్నారు.

యోగధ్యాన కేంద్రంలో ఆధ్యాత్మిక వేడుక

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పతంజలి యోగధ్యాన కేంద్రంలో అర్ధ చాతుర్మాస వ్రత దీక్షా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విష్ణు సహస్రనామ పారాయణం షాద్‌నగర్ అధ్యక్షుడుస్వరాజ్‌బాబు ఆధ్వర్యంలో ప్రతీరోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరైనారు.


హోమం నిర్వహిస్తున్న సభ్యులు





















రైతులకు ప్రొసీడింగ్‌లు అందిస్తున్న అధికారి సురేంద్రనాథ్

రైతులకు స్ప్రింక్లర్ల అందజేత

దౌల్తాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో హార్టికల్చర్ అధికారి సురేంద్రనాథ్ గురువారం రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్ల మంజూరు ప్రొసీడింగ్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు స్ప్రింక్లర్లు, పండ్లు, పూల తోటల పెంపకానికి డ్రిప్, ఉచిత కూరగాయల నారు, పందిళ్ల తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఆయల్ పామ్ పంట సాగు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు వెంకట్‌రెడ్డి, జంగం వీరన్న, విజయ్‌కుమార్, దస్తప్ప, మాధవ్‌రెడ్డి, కె.రాజు, శ్యామప్ప, ఆయిల్ పామ్ ఫీల్డ్ అధికారి మల్లికార్జున్, మొగులప్ప, జైన్‌కంపెనీ డీలర్ రాజప్ప, పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



అమృతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

దుద్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డీ జనార్దన్ అన్నారు. గురువారం కుదురుమళ్లకు చెందిన అమృత ఇటీవల బీఎస్ఎఫ్(బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్)కు ఎంపిక కావడంతో పాఠశాలలో ఆమెకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాసూరి నర్సమ్మ-రాములు దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. మూడో కూతురు అమృతను దేశ రక్షణ కోసం పంపడం గొప్ప విషయం అన్నారు. హెచ్ఎం సాయప్ప, టీచర్లు వేణుగోపాల్, శ్రీనివాస్, మంజుల, తిరుపతి, రవికుమార్, శ్రీనివాస్, లత, పాల్గొన్నారు.

పాఠశాలల్లో సకల సదుపాయాలు



తాగునీటి నల్లాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం సంగం లక్ష్మీబాయి ఉన్నత పాఠశాలను అసిస్టెంట్ కలెక్టర్ హర్షచౌదరిలతో కలిసి తనిఖీ చేశారు. బోధన ఎలా సాగుతోంది? అని విద్యార్థులను అడిగారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వంట గది, బియ్యం నాణ్యతను పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. శుభ్రమైన నీటినే తాగాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



వాగు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

యాలాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధి విశ్వనాథ్‌పూర్ వాగు నుంచి ఇసుక తరలించొద్దని గ్రామస్తులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. విశ్వనాథ్‌పూర్ నుంచి కొడంగల్ మండలంలో నిర్మిస్తున్న పోలీసుస్టేషన్లకు తహసీల్దార్ అనుమతులు జారీ చేశారు. తమ వాగు నుంచి ఇసుక తోడితే సమీప బోర్లలో నీటిమట్టం పడిపోతుందని రైతులు ఆందోళన చేశారు. ఇక్కడి వాగు నుంచి ఇసుక తరలింపు అనుమతి రద్దు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

రైస్‌మిల్లును తరలించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఆదిభట్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండల పరిధి ఉప్పరిగూడ-పోచారం మధ్య గల శ్రీనివాస రైస్‌మిల్లును వేరేచోటుకి తరలించాలని, దుమ్ము, ధూళి, విష వాయువులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు తెలిపారు. ఈమేరకు గురువారం సాయంత్రం రైస్‌మిల్లు వద్ద రైతులు, ఉప్పరిగూడ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. విష వాయువుల కారణంగా పశువులు నేలపై మొలిచే గడ్డిని కూడా మేయలేని పరిస్థితి నెలకొందన్నారు. పశువులు, జీవాలు రోగాలబారిన పడుతున్నాయంటూ వాపోయారు. రైస్‌మిల్లు నుంచి వచ్చే నీటిని పైపుల ద్వారా పొలాల వైపు మళ్లించడంతో పంటలు నష్టపోతున్నామని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లు సూపర్‌వైజర్ గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులతో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డుకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

తెలంగాణ ఏర్పడ్డాక దళితులపై దాడులు

కందుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక దళితుల మీద అనేక దాడులు జరుగతున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని కేవీపీఎస్ రంగారెడ్డి కార్యదర్శి ప్రకాశ్ ఆరోపించారు. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలో సీఐటీయూ కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేవీపీఎస్ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దళితులపై, మైనార్టీ వర్గాలపై దాడులకు తెగబడుతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులను పట్టించుకోవడం లేదన్నారు. ఈమేరకు దాడులకు నిరసనగా ఈ నెల 13న రంగారెడ్డి జిల్లాలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని అన్నివర్గాల కార్మికులు సకాలంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మహేశ్వరం, తలకొండపల్లి మండలాల కన్వీనర్లు కురుమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొందుర్గు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న అన్నారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్, ఉత్తరాస్‌పల్లి, టేకులపల్లి, భైరంపల్లి, మహదేవ్‌పూర్ గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ చిన్నారులకు సరైన సమయంలో ఆకుకూరలు అందిస్తే వారి ఎదుగుదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతీరోజు అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు అనురాధ, శారద, వినోద, భారతి, పార్వతమ్మ గర్భిణీలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించే పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాన్ని గురువారం అధికారులు పరిశీలించారు. మండలంలోని హకీంపేట్‌లో స్థలాన్ని గుర్తించేందుకు డీఆర్డీవో పీడీ శ్రీనివాస్, తహసీల్దార్ కిషన్‌నాయక్, డీపీఎం కొమరయ్యల ఆధ్వర్యంలో గ్రామ శివారులోని ప్రధాన రోడ్డు పక్కన 252 సర్వే నంబర్‌లో 20 గుంటల భూమిని గుర్తించారు. స్థలాన్ని ఏపీఎం బందెయ్యకు అప్పగించారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాస్, సీసీ సంజీవ్ పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

(ఐదో పేజీ తరువాయి)

అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కందుకూరు మండల పరిధిలో వాన దంచి కొట్టింది. ఇబ్రహీంపట్నం పరిధిలో ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు వర్షం కురిసింది.

వికారాబాద్ పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గొట్టిముక్ల వాగు, ద్యాచారం వాగు, జైదుపల్లి వాగు, గోదాంగూడ వాగులు పొంగిపొర్లాయి. గిర్‌గేట్‌పల్లి రైల్వే గేటు వద్ద వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే మోమిన్‌పేట్ మండల కేంద్రంలో భారీ వర్షం కురిసింది. రోజంతా ఎండ తీవ్రత ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ధారూరు మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు నిండుగా ప్రవహించాయి. హరిదాసుపల్లి-చింతకుంట గ్రామాల మధ్య వాగు రోడ్డుపై పొంగి పొర్లింది. దీంతో ధారూరు నుంచి చింతకుంట వైపు రాకపోకలు నిలిచిపోయాయి.



మోమిన్‌పేట్‌లో కురుస్తున్న వర్షం



రహదారులు జలమయం

పరిగి నియోజకవర్గంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి వరద నీరు చేరింది. పరిగి, దోమ, పూడూరు మండలాల్లో కురిసిన భారీ వర్షానికి ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. పరిగి మునిసిపల్ పరిధిలోని బీసీ కాలనీ, పాత పరిగిలోని కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ జలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వాగులు వంకలు పారాయి. పరిగి మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాల్లో నీరు చేరింది. మొక్కజొన్న, జొన్న పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఇబ్బంది పడ్డారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వర్షపాతం ఇలా..

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో అత్యధికంగా 126.5 మిల్లీమీటర్లు నమోదైంది. అలాగే సరూర్‌నగర్ మండలం జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు బిల్డింగ్ వద్ద 113.0 మిల్లీమీటర్లు, గండిపేట్ మణికొండలో 109.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహేశ్వరం మండలం అమీర్‌పేట్‌లో 98.0మిల్లీమీటర్లు, సరూర్‌నగర్ మండలం ఎల్బీనగర్(జీహెచ్ఎంసీ) వద్ద 97.8 మిల్లీమీటర్లు, కందుకూరు మండలం రాచులూరులో 95.5మిల్లీమీటర్లు, సరూర్‌నగర్ మండలం రాక్‌టౌన్ కాలనీలో 91.5 మిల్లీమీటర్లు, అలకపూరి కమ్యూనిటీ హాల్ వద్ద 90.0 మిల్లీమీటర్లు, ఫరూక్‌నగర్ మండలం షాద్‌నగర్‌లో 82.5 మిల్లీమీటర్లు, లింగోజిగూడ వద్ద 82.0 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనంలో 75.8 మిల్లీమీటర్లు, శేరిలింగంపల్లి మండలం కాకతీయ హిల్స్, మాదాపూర్ వద్ద 74.3 మిల్లీమీటర్లు, జేపీఎన్ నగర్ కమ్యూనిటీహాల్, మియాపూర్ వద్ద 74.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మేడ్చల్ జిల్లా ఉప్పల్ మండలం జీహెచ్ఎంసీ జోనల్ ఆఫీస్ వద్ద అత్యధికంగా 104.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. న్యూ నాగోల్ వెల్ఫేర్ అసోసియేషన్ వద్ద 93.5 మిల్లీమీటర్లు, మూర్తినగర్, మహిళ సభ సెంటర్ వద్ద 87.8 మిల్లీమీటర్లు, బాలానగర్ కమ్యూనిటీహాల్ వద్ద 79.0 మిల్లీమీటర్లు, రామంతాపూర్‌లో వార్డు ఆఫీస్ వద్ద 77.5 మిల్లీమీటర్లు, ముసారమ్‌బాగ్ వార్డు ఆఫీస్ వద్ద 76.0 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లి ఈఎస్ఎస్‌హెచ్ఎంటీ హిల్స్, హైదర్‌నగర్ వద్ద 75.3 మిల్లీమీటర్లు, కూకట్‌పల్లి మండలం శంషీగూడ వద్ద 70.8 మిల్లీమీటర్లు, సీబీసీఐడీ కాలనీ, కేపీహెచ్‌పీలో 70.5 మిల్లీమీటర్లు, పీహెచ్‌సీ సెంటర్ పీర్జాగూడ వద్ద 65.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా పూడూర్ మండలం పెద్దఉమ్మెంతాల్‌లో 66.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బషీరాబాద్‌లో 66.5 మిల్లీమీటర్లు, ధారూరులో 48.0 మిల్లీమీటర్లు నమోదైంది.

పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

» ఫేక్ అటెండెన్స్‌తో ఆరుగురికి జారీ

కులకచర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో ఫేక్ అటెండెన్స్‌కు పాల్పడిన ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు అధికారులు మెమోలు జారీ చేశారు. ఇటీవల ఫేక్ అటెండెన్స్‌పై పంచాయతీరాజ్ కమిషనర్ ఆరా తీయగా కులకచర్ల మండలంలో గోరిగడ్డ తండా జీపీ కార్యదర్శి కామెరిద్దీన్, చాపలగూడెం కార్యదర్శి శ్రీనివాస్, చౌడాపూర్ మండలం మందిపాల్ కార్యదర్శి స్వరూప, మల్కాపూర్ కార్యదర్శి రేణుక, కొత్తపల్లి తండా కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్, కల్మన్ కాల్వ కార్యదర్శి బాల్‌రాజ్‌ను గుర్తించారు. దీంతో సదరు కార్యదర్శులకు డీపీవో జయసుధ మెమోలు జారీ చేశారు. మీపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో సంజాయిషీ ఇవ్వాలని సూచించారు.

సిబ్బంది వచ్చాకే..కొత్త రూట్లకు బస్సులు

» షాద్‌నగర్ డీఎం ఉష

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ డిపోలో సిబ్బంది కొరత ఉందని, ఆ సమస్య పరిష్కారమయ్యాక కొత్త రూట్లకు బస్సులను నడిపిస్తామని డిపో మేనేజర్ ఉష తెలిపారు. గురువారం డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. షాద్‌నగర్ డిపో పరిధిలోని కొత్త రూట్లకు బస్సులను నడపాలని, నైట్ ఆల్ట్ బస్సులను వేయాలని, ట్రిప్పులను పెంచాలని ప్రయాణికులు కోరడంతో ఆమె ఈ విధంగా స్పందించారు. షాద్‌నగర్ డిపోలో అద్దె వాటితో కలిపి 89 బస్సులు ఉన్నాయని, కేవలం 104 మంది డ్రైవర్లు, 150 మంది కండక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 40 రూట్లలో బస్సులను నడిపిస్తున్నామని, సరిపడా సిబ్బంది లేకపోవడంతో కొత్తరూట్లలో బస్సులను పంపలేకపోతున్నామని తెలిపారు. షాద్‌నగర్ నుంచి అరంఘర్‌కు నడిపిస్తున్న బస్సులు శంషాబాద్ బస్టాండ్‌కు వెళ్లి వచ్చేలా చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకూ పోరాటం

● రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్



ఢిల్లీలో మంత్రులు శ్రీహరి, ప్రభాకర్‌లతో లాల్‌కృష్ణ, తదితరులు

దుద్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు పోరాటం ఆగదని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ రెండు రోజుల ధర్నా సందర్భంగా గురువారం ఆయన పాల్గొన్నారు. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల పదవుల్లో 42శాతం రిజర్వేషన్, చట్ట సభల్లోనూ రిజర్వేషన్ కల్పించాలన్నారు. బిల్లును పార్లమెంట్ తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం కొడంగల్ తాలూకా అధ్యక్షుడు బస్వరాజ్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకులు యాదగిరిపటేల్, సత్యపాల్, కృష్ణ, మన్సూర్, రాజు, కాశీయాదవ్, గోపాల్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ ధర్నాలో పరిగి నాయకులు

పరిగి: బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల కోసం ఢిల్లీలో గురువారం నిర్వహించిన ధర్నాలో పరిగి నాయకులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.లాల్‌కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఢిల్లీకి తరలివెళ్లారు. మంత్రులు వాకాటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్‌గౌడ్‌లతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు.. లాల్‌కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ యువకుడిని బీసీ అని చెబుతూ..

» కుల ధ్రువీకరణ పత్రంలో పొరపాటు

» మీ-సేవలో ప్రింట్ తీసి చూసుకొని కంగుతిన్న యువకుడు.. సాంకేతిక సమస్యవల్లే

కేశంపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఎనిమిదేళ్ల క్రితం తనకు జారీ చేసిన కులధ్రువీకరణ పత్రాన్ని తాజాగా మీ సేవ కేంద్రంలో ప్రింట్ తీసి చూసుకొని కంగుతిన్నాడు! తాను ఎస్టీ అయితే ఆ సర్టిఫికెట్‌లో బీసీగా ఉండటం చూసి ఆందోళనకు గురయ్యాడు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన జర్పుల శ్రీహరికి ఎదురైన సమస్య ఇది. ఇంజనీరింగ్‌లో చేరేందుకు శ్రీహరి 2017 ఆగస్టు 18న కేశంపేట తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎస్టీ ధ్రువీకరణ పత్రాన్ని పొందాడు. ఉన్నత చదువుల కోసం కుల ధ్రువీకరణ పత్రం కాపీ అవసరపడటంతో బుధవారం శ్రీహరి తండ్రి దాసునాయక్ కేశంపేటలోని ఓ మీ సేవ కేంద్రంలో కుమారుడి ఆధార్ నంబరు ఆధారంగా ప్రింట్ తీసుకున్నాడు. అయితే ఆ పత్రంలో శ్రీహరి బీసీ అని వచ్చింది. అయితే ఆ పత్రం మధ్య భాగంలో ఎస్టీగా వివరాలున్నాయి. సర్టిఫికెట్‌లో ఇలా రెండు కులాల వివరాలు ఉండటాన్ని చూసి ఆందోళనకు గురైన దాసునాయక్ గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సరిచేయాలని కోరాడు. సర్వర్, పోర్టల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా కుల ధ్రువీకరణ పత్రం జారీలో పొరపాటు జరిగి ఉండొచ్చునని, సరిచేసి ఇస్తామని తహసీల్దార్ ఆజం అలీ చెప్పారు.



2017లో జారీ చేసిన ఎస్టీ కులం సర్టిఫికెట్



2025 ఆగస్టు 6న తీసుకున్న ప్రింట్‌లో ఎస్టీ కులం సర్టిఫికెట్‌లో బీసీగా నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ రత్నం

అభివృద్ధిని గాలికొదిలేసిన కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో అభివృద్ధిని గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీలపై విమర్శించడమే పనిగా పెట్టుకుందని బీజేపీ సీనియర్‌నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆరోపించారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రత్నం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి మాయమాటలతో కాలయాపన చేస్తుందని, గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా బాగుచేయడం లేదన్నారు. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు బీజేపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చినా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కేంద్రం నుంచి పెద్దమొత్తంలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తున్నారని, నియోజకవర్గంలో రూ.కోటీ 50లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు కొనసాగుతున్నట్లు చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలో రూ.3కోట్ల 70లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని చెప్పారు. రోడ్ల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వలేని స్థితిలో ఉందని విమర్శించారు.

విస్మరించిన నాయకులు

పూటకో పార్టీ మారిన నాయకులు అభివృద్ధిని విస్మరించి స్వార్థరాజకీయాల కోసం పని చేస్తున్నారని రత్నం ధ్వజమెత్తారు. పార్టీలు మారిన ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యలు సొంత నియోజకవర్గమైన చేవెళ్ల అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. స్వార్థ రాజకీయాలు, పైరవీలు, కుటుంబ పాలన సాగిస్తున్నారే తప్ప అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, చేవెళ్ల అభివృద్ధిపై చర్చికు రావాలని సవాల్ విసిరారు. సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మండలాధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు డాక్టర్ మల్లారి వైభవ్‌రెడ్డి, శంకర్‌గౌడ్, అశోక్, సత్యనారాయణ, జయసింహరెడ్డి, తదితరులు ఉన్నారు.



సినిమా యూనిట్ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్లలో కలివి వనం సినిమా సాంగ్ రిలీజ్

చేవెళ్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో గురువారం సాయంత్రం కలివి వనం సినిమాసాంగ్ రిలీజ్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా యూనిట్ సభ్యులు సందడి చేశారు. కార్యక్రమంలో సినిమా డైరెక్టర్ రాజ్ నరేంద్ర, బిత్తిరి సత్తి అలియాస్ పామెన రవి, నటి నాగదుర్గ, సీనియర్ నటుడు గాంధీ, నిర్మాతలు మల్లికార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, వివేకానంద కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, నాయకులు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



నీలకంఠస్వామిని శావపై ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన నీలకంఠ స్వామి మహోత్సవాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): కొర్రెములలోని మహంకాళి సమేత బ్రమసూత్ర నీలకంఠస్వామి ఆలయ వార్షిక మహోత్సవాలు గురువారం ముగిశాయి. స్వామివారికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఏశావను ఊరేగించారు. భక్తులు భజనలతో ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓరుగంటి కవిత, వెంకటేశ్‌గౌడ్, రాజు, నాగార్జున, బొడ్డు వినోద, ఆంజనేయులు, రవికుమార్, దుర్గరాజు గౌడ్ పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

● శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ తెలిపారు. ఆయన కార్యాలయంలో గురువారం అధికారులు, గ్రామకార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఆగస్టు 11 నుంచి 15 వరకు వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు మునగ, బొప్పాయి చెట్లను నాటేందుకు గుంతలకయ్యే ఖర్చుతో పాటుగా నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సమావేశంలో ఎంపీవో అక్బర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు రేవతిరెడ్డి, ఎంపీవో గిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి గృహానికి నోచని ఆమనగల్లు

● రెండు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం

● చొరవ చూపని పాలకులు, నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అతిథి గృహ నిర్మాణం హామీలకే పరిమితమైంది. రెండు దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. అతిథిగృహ నిర్మాణ విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదు. నాలుగు మండలాలకు కూడలిగా, రాష్ట్ర రాజధానికి చేరువలో ఉన్న ఆమనగల్లు పట్టణంలో ఏ ఒక్క శాఖకు అతిథి గృహం లేదు. అతిథి గృహ నిర్మాణం గురించి ఏళ్లకాలంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదు. పలు మార్లు పట్టణానికి వచ్చిన మంత్రులు, కలెక్టర్, ఉన్నతాధికారులకు స్థానికులు ఆర్అండ్‌బీ అతిథి గృహం నిర్మాణం గురించి విన్నవించినా ఫలితం లేకపోయింది.



పునరుద్ధరణకు నోచని అటవీశాఖ అతిథి గృహం

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న ఆమనగల్లు పట్టణానికి తరచూ మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, వివిధ బృందాలు, అతిథులు వస్తుంటారు. వారు విశ్రాంతి తీసుకోవడానికి, భోజనానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ప్రెస్‌మీట్‌లకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. విధిలేక కొన్నిసార్లు పట్టణ సమీపంలోని కాటన్ మిల్లు గెస్ట్‌హౌజ్‌ను ఉపయోగించుకుంటున్నారు. దశాబ్దాల క్రితం అటవీశాఖ కార్యాలయం ఆవరణలో నిర్మించిన అతిథి గృహాన్ని రెండు దశాబ్దాల క్రితం మావోయిస్టులు పేల్చివేసినా నేటికీ పునరుద్ధరించలేదు. ఆర్అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపారు. పట్టణంలో అనేక చోట్ల అతిథి గృహ నిర్మాణానికి అనువైన స్థలాలు కూడా ఉన్నాయి. ఆ దిశగా ఎవరూ చొరవ చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని అతిథి గృహం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

యాచారం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కోరారు. గురువారం తక్కళ్లపల్లిలో మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సమకూర్చిన 30 సీసీ కెమెరాలను ఏసీపీ ప్రారంభించారు. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారమందించాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. ప్రజలకెలాంటి ఇబ్బందులున్నా పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామాభివృద్ధిలో యువత పాలు పంచుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఎస్సై మధు, మాజీ సర్పంచ్ సంతోష, మాజీ ఉపసర్పంచ్ పగడాల శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ గడల మాధవి, నాయకులు కోరే జగదీశ్, నితిన్ తదితరులున్నారు. కాగా సీసీ కెమెరాల ఏర్పాటు చేసిన ఎస్ఆర్ హేచరీస్ అధినేత డాక్టర్ రంజిత్‌రెడ్డికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.



తక్కళ్లపల్లిలో సీసీ కెమెరాలు ప్రారంభించి మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

సర్వేకు సహకరించండి

ప్రభుత్వం నుంచి పరిహారంతో పాటు ప్లాట్లు పొందిన మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద రైతులు గ్రామాలలో చేపట్టే సర్వేకు సహకరించాలని ఏసీపీ కోరారు. ఈమేరకు ఆయన సర్వేను పరిశీలించారు. సర్వే పక్కాగా చేపట్టాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే సమాచారమందించాలని కోరారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై సైదులు తదితరులున్నారు.

లయన్స్‌క్లబ్ జిల్లా కోశాధికారిగా రాంరెడ్డి



రాంరెడ్డిని సన్మానిస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన భీంరెడ్డి రాంరెడ్డిని లయన్స్‌క్లబ్ జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఈమేరకు గురువారం నగరంలోని సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు, సభ్యులు నరేందర్‌రెడ్డి, రఘు, కిషన్‌రెడ్డి, తాళ్ల అంజయ్య, తీగల జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



చౌదరిగూడ : లాల్‌పహాడ్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏవో రాజేందర్‌రెడ్డి

చౌదరిగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లేడ్ చౌదరిగూడ వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లాల్‌పహాడ్, చౌదరిగూడ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలను ఏవో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో రైతులకు సరిపడిన యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులు ఎరువులను పంటలకు తగిన మోతాదులోనే వాడుకోవాలని ఆయన సూచించారు.

కొత్తపేట ప్యాక్స్‌కు 450 బస్తాలు

కేశంపేట : మండల పరిధిలోని కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి శిరీష తెలిపారు. గురువారం కొత్తపేట ప్యాక్స్‌కు 450 బస్తాల యూరియా తెప్పించినట్లు వివరించారు. అవసరం ఉన్న రైతులు ఆధార్ కార్డు చూపించి యూరియా తీసుకెళ్లాలని సూచించారు. ఇప్పటి వరకు మండలానికి 1100 మెట్రిక్ టన్నుల యూరియా తెప్పించామన్నారు. రైతులకు సరిపడా యూరియా అందిస్తున్నామన్నారు.



కేశంపేట : కొత్తపేట పీఏసీఎస్‌కు చేరిన యూరియా లోడ్

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి



కేశంపేట : మాట్లాడుతున్న వైద్యాధికారి నిఖిత

ఆమనగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి తెలిపారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. మెడికలాఫీసర్ డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ షైమునా, ఎంపీడీవో, తహసీల్దార్ లలిత, ఎంఈవో పాండులు హాజరయ్యారు. ఈనెల 11 నుంచి 18వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు నులిపుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. ఆశాకార్యకర్తలు, ఐసీడీఎస్, మున్సిపల్, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కేశంపేట : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నిఖిత సూచించారు. మండల పరిషత్ కార్యాలయం, పీహెచ్‌సీలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆశాలు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నిఖిత మాట్లాడుతూ 1నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సున్న వారికి నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమాలలో ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆమనగల్లు : మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ చందు

మొయినాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై నిరంతరం ఏబీవీపీ పోరాటం చేస్తుందని ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ చందు అన్నారు. గురువారం మొయినాబాద్ పట్టణ కేంద్రంలో ఏబీవీపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నలుమూలలా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని అన్నారు. మొయినాబాద్ నగర కార్యదర్శి వినయ్‌కుమార్‌యాదవ్, జాయింట్ సెక్రటరీ సంజయ్, నాయకులు భార్గవ్‌రామ్, దేవేందర్, శ్రీకాంత్, నర్సింహరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

షాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎంపీడీవో అపర్ణ అన్నారు. రక్షాబంధన్ కార్యక్రమంలో భాగంగా గురువారం షాబాద్‌లోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులచే రాఖీలు కట్టించారు. వారు మాట్లాడుతూ. విద్యార్థులలో సోదర, సోదరీమణుల భావం, కులమత బేధం లేకుండా ఐకమత్యంతో ఉండాలన్నారు. రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాష్, విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ శ్రీకాంత్, నగర అధ్యక్షుడు యాదయ్య, నగర కార్యదర్శి మధు, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

గిరిజన విద్యార్థులకు శిక్షణ శిబిరాలు

కడ్తాల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థినీ విద్యార్థుల్లో శారీరక, మానసిక, సామాజిక అవగాహన పెంపొందించేందుకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీటీడబ్ల్యూవో రామేశ్వరిదేవి, ఏటీడబ్ల్యూవో వెంకటయ్యలు అన్నారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో హర్ వాయిస్ పరిచయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీడబ్ల్యూవో రామేశ్వరి దేవి, ఏటీడబ్ల్యూవో వెంకటయ్యలు హాజరై ప్రారంభించారు. శిబిరం ఆగస్టు 14 వరకు కొనసాగుతుందన్నారు. హెచ్‌డబ్ల్యూవో గోపాల్, హెచ్‌ఎం విమల, ఉపాధ్యాయులు జ్యోతి, శాంభవి, కీర్తి తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారం 278వ రోజుకు చేరాయి. నాయకులు, యువకులు దీక్షలో ఉన్నారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

(ఐదో పేజీ తరువాయి)

పంపిణీ చేయనున్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అనేక రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు సమీపంలోని జీడిమెట్ల వద్ద ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్ నర్సరీ నుంచి కూరగాయల నారును సరఫరా చేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాకుండా అనేక రకాల పంట సాగుకు సైతం ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు అందుబాటులో ఉన్నాయి.

నెల ముందే దరఖాస్తు చేసుకోవాలి

ఎంఐడీహెచ్ పథకంలో భాగంగా కూరగాయల నారును ఉచితంగా పొందాలనుకునే రైతులు సాగుకు నెలరోజుల ముందే జిల్లాలోని ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక ఎకరంలో టమాట, వంకాయ సాగు చేయాలంటే 8వేల మొక్కలు, మిర్చి సాగుకు 6,500మొక్కలు అవసరం ఉంటాయి. వానాకాలం సీజన్‌నుంచే రైతులకు ఉచిత నారు పంపిణీ చేయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు మంజూరు లభించాక జీడిమెట్ల సెంటర్‌కు వెళ్లి రవాణా ఖర్చుతో నారును తెచ్చుకోవాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

ఆమనగల్లు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పీసీసీ చేనేత విభాగ రాష్ట్ర కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగళి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చేనేత కార్మికులు, పద్మశాలి సంఘం నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికులు హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోగల పీపుల్స్‌ప్లాజాలో జరిగిన చేనేత ఎగ్జిబిషన్‌కు తరలివెళ్లారు. పద్మశాలి సంఘం నాయకులు పురుషోత్తం, సత్యనారాయణ, ఆనంద్, బుచ్చయ్య, వెంకటేశ్, యాదయ్య, తిరుపతయ్య, సత్తయ్య, కార్మికులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన రేవంత్‌రెడ్డి

మాడ్గుల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి విమర్శించారు. ఈమేరకు మాడ్గుల మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికలకు ముందు ప్రజలను మభ్యపెట్టి ఎన్నోరకాల హామీలిచ్చి ఆ తరువాత మోసం చేశారని ఆరోపించారు. 2వేల పింఛన్‌ను 4వేలకు పెంచకపోతే బీజేపీ ఆధ్వర్యంలో 30న సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలోని ఆయన స్వగృహాన్ని డప్పులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం తహసీల్దార్ వినయ్‌సాగర్‌కు వినతిపత్రం అందచేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, నరోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు పెద్దయ్యాయాదవ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

వారి అనుబంధం ముందు చావూ చతికిల!

● కొన్ని గంటల వ్యవధిలోనే వృద్ధ దంపతుల మృతి

● అస్వస్థతతో భర్త కన్నుమూత.. కొద్దిసేపటికే భార్యకు గుండెపోటు

షాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కష్టసుఖాల్లో పరస్పరం తోడుంటామంటూ అగ్నిసాక్షిగా చేసిన పెళ్లి ప్రమాణాల మధ్య పడిన ఆ మూడుముళ్ల బంధాన్ని చావు తప్ప ఏదీ విడదీయలేదు అంటారు! ఆ వృద్ధ దంపతులను చావు కూడా విడదీయలేకపోయింది. పరస్పరం ప్రాణంగా బతికిన ఆ దంపతులు ఒకరి తర్వాత మరొకరు కొన్ని గంటల తేడాతో తుదిశ్వాస విడిచారు. షాబాద్ మండలంలోని హైతాబాద్‌లో ఈ ఘటన జరిగింది. వృద్ధ దంపతుల కుమారుడు రమేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన అన్నె ప్రసాద్‌రావు (83), పార్వతి (72) గత ఐదారేళ్లుగా హైతాబాద్‌లోని ఇంట్లో ఉంటున్నారు. బుధవారం రాత్రి ప్రసాద్‌రావు అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను తొలుత దగ్గర్లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనతో మెరుగైన చికిత్స కోసం శంషాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఈ వార్త చెవిన పడటంతో ప్రసాద్‌రావు భార్య పార్వతి గుండెపోటుతో కుప్పకూలి మృతిచెందారు. కొద్దిసేపట్లోనే వృద్ధ దంపతులు చనిపోవడంతో గ్రామం లో విషాదఛాయలు అలుముకున్నాయి.



ప్రసాద్‌రావు, పార్వతి (ఫైల్)

వైద్యశిబిరం విజయవంతం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తలకొండపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేవుని పడకల్ గ్రామంలో గురువారం కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం శిబిరం ప్రారంభించారు. వైద్యులు శ్రీవిద్య, జ్యోష్ణలు 110 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సిబ్బంది నర్సింగ్, సందీప్, నాయకులు శ్రీను, భిక్షపతి, నర్సింహ, బాలరాజ్, అంజయ్య, చెన్నయ్య, బాలమ్మ, ముత్యాలమ్మ, రాములమ్మ తదితరులు ఉన్నారు.

బీసీల వ్యతిరేక పార్టీ బీజేపీ

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 7(ఆంధ్యజ్యోతి): బీజేపీ బీసీల వ్యతిరేక పార్టీ అని, రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు రాష్ట్రపతితో ఆమోదింపజేసి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి అన్నారు. ఈమేరకు గురువారం అజీజ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గతం నుంచీ బీసీలకు భారతీయ జనతా పార్టీ వ్యతిరేకమని.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్‌చేసి కేంద్రానికి పంపాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లును తీసుకువస్తే ఓర్వలేక ప్రతిపక్షాలు అనేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీలకతీతంగా అందరూ బీసీ బిల్లు ఆమోదం కోసం కృషి చేయాలని కోరారు. అంతేకాకుండా తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపచేయించి బీసీలపై వారికున్న చిత్తశుద్ధిని నిలుపుకోవాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలుదాచి ప్రజలు మభ్యపెట్టిన బీఆర్‌ఎస్ నేతల నిజస్వరూపాన్ని ఘోష్ కమిషన్ నివేదిక బట్టబయలు చేయనుందన్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



కృష్ణ (ఫైల్)

మొయినాబాద్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి నక్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీస్‌లు కథనం మేరకు.. నక్కలపల్లికి చెందిన అనేమోని బాలకిష్టయ్య దత్తపుత్రుడు శ్రీకాంత్(26) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 4న క్యాబ్ డ్రైవింగ్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఆతర్వాత కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా తీయలేదు. డ్రైవింగ్‌లో ఉన్నాడని భావించారు. ఈనెల 7న పాత ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లిచూడగా శ్రీకాంత్ దూలానికి ఉరేసుకొని ఉండటాన్ని గమనించారు. కుటుంబ సభ్యులు పో లీస్‌లకు సమాచారం ఇవ్వడంతో వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

మహిళను కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం

● తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో మహిళకు చికిత్స

● పరారీలో ముగ్గురు నిందితులు

● శంషాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

● ఆలస్యంగా వెలుగులోకి ఘటన

శంషాబాద్ రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళను కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం ఆలూరుకు చెందిన కొండకళ్ల పద్మజ (28) అదే గ్రామానికి చెందిన కమ్మెట విజయ్‌గౌడ్‌కు రూ.4లక్షల అప్పుగా ఇచ్చింది. తిరిగి ఇవ్వాలని విజయ్‌గౌడ్‌పై పద్మజ ఒత్తిడి తెచ్చింది. ఈక్రమంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో విజయ్‌గౌడ్ ఆమెపై పగ పెంచుకున్నాడు. అయితే, బాధితురాలి భర్త బుచ్చయ్య మండల పరిధిలోని మల్కారం ఆశాజ్యోతి ఆస్పత్రిలో మానసిక సమస్యతో చికిత్స పొందుతున్నాడు. ఈనెల 5న ఆస్పత్రిలో ఉన్న భర్త దగ్గరకు పద్మజ వెళ్తున్న విషయం తెలుసుకున్న విజయ్‌గౌడ్ తన స్నేహితులైన వెంకటేష్, సాయితో కలిసి మల్కారంలో ఎర్టిగా కారు(టీజీ07 8196)లో ఆమెను మధ్యాహ్నం 1.30 గంటలకు కిడ్నాప్ చేశారు. ఈక్రమంలో ఆమెను తీసుకెళ్తుండగా మున్సిపల్ పరిధిలోని కొత్వాల్‌గూడ ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో ఎదురుగా వస్తున్న బీఎండబ్ల్యూ కారును వారు వెళ్తున్న కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఆ ముగ్గురు నిందితులు కారు వదిలేసి పరారయ్యారు. పద్మజకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు అదేరోజు ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేశారు. పోలీసులకు పద్మజ అసలు విషయం తెలపడంతో పరారీలో ఉన్న ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నరేందర్ రెడ్డి తెలిపారు. అయితే, ఒకవేళ రోడ్డు ప్రమాదం జరగకపోతే ఆమెను హత్య చేసేవారని పోలీసులు భావిస్తున్నారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని పోలీసులు తెలిపారు.

కార్యకర్తకు సబితా ఇంద్రారెడ్డి పరామర్శ



ధన్‌పాల్ రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 7(ఆంధ్యజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని.. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కాశీంబౌళికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ధన్‌పాల్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా గురువారం ఆయన ఇంటికి సబితారెడ్డి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి అనంతరెడ్డి, ఆంజనేయులు, మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కొత్త నర్సింహరెడ్డి, ముదిగొండ శ్రీహరియాదవ్, రవియాదవ్, నరోత్తంరెడ్డి, కొత్తపల్లి తిరుపతిరెడ్డి, చిడిగిద్ద కృష్ణరెడ్డి, అంజయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

ఇర్విన్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

● ట్రిపుల్ ఐటీ బాసరకు 10 మంది.. ఎన్ఎంఎంఎస్‌కు 19 ఎంపిక



విద్యార్థులతో డీఈవో సుశీంద్రరావు తదితరులు

మాడ్గుల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్విన్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 10మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికవ్వగా.. ఎన్ఎంఎంఎస్‌కు 19 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు పర్వతాలు తెలిపారు. ఈమేరకు విద్యార్థులకు గురువారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా డీఈవో సుశీంద్రరావు, తెలంగాణ విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్‌లు హాజరై విద్యార్థులను అభినందించారు. ఎంఈవో సర్దార్‌నాయక్, మాడ్గుల పాఠశాల హెచ్‌ఎం సుదర్శన్, రవిందర్, లక్ష్మణ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న చెన్నయ్య

షాద్‌నగర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వారు నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ పట్టణాధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ షాద్‌నగర్ పట్టణాభివృద్ధిని ప్రతిపాదనలకే పరిమితం చేసిందని తెలిపారు. ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ఆరోపించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెన్నయ్య విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని అన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నటరాజన్ కాంగ్రెస్ నాయకులను రాజకీయ కొత్త భిక్షగాళ్లు అంటూ మాట్లాడడం సరికాదన్నారు. నటరాజన్ కూడా కాంగ్రెస్ పార్టీ భిక్ష పెట్టగా బీఆర్ఎస్‌కు వెళ్లిన విషయాన్ని మరువొద్దని సూచించారు. నటరాజన్ ఇంటి ముందే ఉన్న రోడ్డును సీసీగా మార్చడం, ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసిన విషయం గుర్తుచేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మంజూరు చేయించిన పనులకు కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొడుతున్నారని విమర్శలు చేయడం సరికాదన్నారు. అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇప్పటికే షాద్‌నగర్ పట్టణంలో రూ.33 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేశారని, మరో రూ.50 కోట్లు మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు. అందె మోహన్, రాజేందర్‌రెడ్డి, ముబారక్, ఖదీర్, వాసు తదితరులు పాల్గొన్నారు.